నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

రసూల్‌పురా: సికింద్రాబాద్ డివిజనల్ ధర్మకాంట, రాష్ట్రపతి నిలయం 11 కేవీ ఫీడర్ల పరిధిలో ఫీడర్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సికింద్రాబాద్ ఏడీఈ కే.మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు ఎఫ్‌బీ నగర్, తిరుమల ఎన్‌క్లేవ్, మంజీరా కాలనీ, సాయిబాబానగర్, ఫాదర్ బాలయ్యనగర్, ఏఆర్‌కే హోమ్స్, వీబీ సిటీ, రైల్వే కాలనీ ఫేజ్-1, ఫేజ్-2 పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కరెంటు సరఫరా ఉండదని తెలిపారు.

జేమ్స్ స్ట్రీట్ పరిసర ప్రాంతాల్లో..

రాంగోపాల్‌పేట్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల కారణంగా జేమ్స్ స్ట్రీట్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఆదినారాయణ రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోస్ట్ ఆఫీస్, సింద్ బ్యాంక్, హనుమాన్ చరణ్, కేడియా హౌస్, మూల్ చంద్ ప్రియాంక, కెనరా బ్యాంక్ పరిసర ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కృష్ణానగర్, పీజీ రోడ్డు, ఫుడ్ వరల్డ్, సింధి కాలనీ, ఎయిర్‌లైన్స్ టవర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. విద్యుత్ ఫీడర్లకు రిపేర్లతో పాటు ట్రీ బ్రాంచ్ కట్టింగ్ పనుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉండనున్నట్లు తెలిపారు.

బేగంపేట్, మైత్రీవనం సబ్‌స్టేషన్ల పరిధిలో..

సనత్‌నగర్: బేగంపేట్, మైత్రీవనం సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు లీలానగర్, విద్యుత్ టవర్, రైల్వేట్రాక్ ఏరియా, గ్రీన్ పార్కు, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, దివ్యశక్తి అపార్ట్‌మెంట్స్, శీష్‌మహల్ థియేటర్ మెయిన్‌రోడ్డు, సోనాబాయి టెంపుల్, సత్యం థియేటర్, స్పెన్సర్ బిల్డింగ్, ప్లేగ్రౌండ్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

త్వరలో సీసీరోడ్డు వేయిస్తాం



వీరయ్య గల్లీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి వీరయ్యగల్లీలో కార్పొరేటర్ సామల హేమ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బస్తీలో నూతన సీసీ రోడ్డు వేసేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. త్వరలోనే మంజూరు అవుతుందన్నారు. చెట్ల కొమ్మలు హైటెన్షన్ వైర్లకు తగులుతున్నాయని, వెంటనే వాటిని తొలగించే విధంగా సంబంధిత అధికారులతో మాట్లాడతానన్నారు. పర్యటనలో బీఆర్‌ఎస్ నాయకుడు బాలాజీ, స్థానికులు పాల్గొన్నారు.

ఊరెళ్లి వచ్చేసరికి ఇల్లు గుల్ల

రూ.10 లక్షల విలువైన బంగారు ఆభరణాల అపహరణ

వెంగళరావునగర్: ఊరెళ్లి వచ్చేసరికి ఇల్లు గుల్ల అయిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రిటైర్డ్ జీఎస్‌టీ సూపరింటెండెంట్ ఆకుల శ్రీహరిరావు మధురానగర్‌కాలనీలో నివాసముంటున్నాడు. ఈనెల 21న తన స్వగ్రామం తాడేపల్లిగూడెంకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. సోమవారం అర్ధరాత్రి ఇంటికి వచ్చాడు. తలుపు తెరిచి చూడగా బెడ్రూం తాళాలు పగులగొట్టి ఉన్నాయి. అందులోని లాకర్‌లో ఉండాల్సిన దాదాపు రూ.10 లక్షల విలువైన 606 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.50 వేలు కనిపించలేదు. దీంతో బాధితుడు మంగళవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం



పంజగుట్ట: ఎర్రమంజిల్ కాలనీ, రామకృష్ణానగర్‌లోని రేణుకాఎల్లమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారి 20వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణం జరిపించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వడ్డీలేని రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ఫిలింనగర్: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న వడ్డీలేని రుణాలను సద్వినియోగం చేసుకోవాలని స్వామి వివేకానంద నగర్ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జి.వరలక్ష్మి సూచించారు. మంగళవారం ఫిలింనగర్‌లోని స్వామి వివేకానందనగర్ బస్తీలో మహిళా పొదుపు గ్రూపుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పొదుపు గ్రూపుల్లో లేని మహిళలు చేరాలన్నారు.

ఆ ప్రాజెక్టులు ముందుకు సాగేనా..?

- ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు పట్టాలెక్కేది ఎప్పుడో..?
- గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపనలు
- విడుదలైన నిధులు ఏమయ్యాయి..?
- వెక్కిరిస్తున్న శిలాఫలకాలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ఆర్‌యూబీ నిర్మాణం చేపట్టే ప్రాంతం ఇదే..

సనత్‌నగర్: సనత్‌నగర్ ప్రాంత రూపురేఖలను మార్చే రెండు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు శంకుస్థాపన జరిగిన రెండేళ్లు దాటినా ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదు. కేవలం శిలాఫలకాలకే పరిమితం అయ్యారే తప్ప ఆ ప్రాజెక్టులను పట్టాలెక్కిద్దామన్న చిత్తశుద్ధి అధికారుల్లో కరువైంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఆయా ప్రాజెక్టులకు మోక్షం కలగడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఏడాదిన్నర దాటినా ఇప్పటికీ వాటి ఊసే లేదు. అసలు ఆ ప్రాజెక్టులు ముందుకు సాగుతాయా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. అంతకంతకూ పెరుగుతున్న ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని సనత్‌నగర్ ఇండస్ట్రియల్ ఏరియా నుంచి రైలు పట్టాల కిందనుంచి ఆర్‌యూబీ నిర్మాణం చేపట్టి బాలానగర్ నర్సాపూర్ చౌరస్తాకు అనుసంధానం చేయాలని గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన విషయం తెలిసిందే. ఆర్‌యూబీ నిర్మాణం కోసం రైల్వే శాఖకు జీహెచ్‌ఎంసీ నుంచి నిధులు కూడా చెల్లించారు. అయితే ఇంతవరకు ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఒక్క అడుగు ముందుకు పడలేదు.

అండర్‌పాస్ నిర్మాణం చేపట్టాలని ప్రణాళికలు

హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్(హెచ్‌ఆర్‌డీసీఎల్), రైల్వే శాఖలు సంయుక్తంగా ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలి. అందుకోసం సర్వే కూడా పూర్తి చేసి మొత్తం 2.34 కిలో మీటర్ల మార్గంలో 600 మీటర్ల మేర రైలు పట్టాల కిందుగా నగరంలోనే అతి పొడవైన ప్రాజెక్టుగా అండర్‌పాస్ నిర్మాణం చేపట్టాలని ప్రణాళికలు రూపొందించారు. మొత్తం నాలుగు లేన్లుగా సనత్‌నగర్ పారిశ్రామికవాడ నుంచి సనత్‌నగర్-ఫతేనగర్ రైల్వే లైన్ల కిందుగా నిర్మించే అండర్‌పాస్ బ్రిడ్జి పనులను గతంలో మంత్రులుగా ఉన్న కేటీఆర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించారు. మొత్తం రూ.68.30 కోట్ల ప్రాజెక్టు వ్యయంలో సుమారు రూ.40 కోట్లను రైలు పట్టాల కింద నుంచి అండర్‌పాస్ నిర్మించడం కోసం రైల్వేశాఖకు కేటాయించారు. సికింద్రాబాద్-ముంబై లేన్‌లో ఉన్న ఏడు రైలు పట్టాల కిందుగా అండర్‌పాస్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఆర్‌యూబీ నిర్మాణం పూర్తయితే సనత్‌నగర్ నుంచి నర్సాపూర్ చౌరస్తాకు కేవలం ఐదు నిమిషాల్లో, మరోవైపు ఎర్రగడ్డ నుంచి బాలానగర్‌కు 10 నిమిషాల వ్యవధిలోనే చేరుకునే వెసులుబాటు కలుగుతుంది.

ఫతేనగర్ బ్రిడ్జి విస్తరణ జరిగేనా..?

ప్రస్తుత వాహన విస్ఫోటనానికి ఏమాత్రం ఫతేనగర్ బ్రిడ్జి అవసరాలను తీర్చలేకపోతోంది. మేడ్చల్, హైదరాబాద్ జిల్లాకు అనుసంధానంగా ఉన్న ఈ బ్రిడ్జిపై వాహన ఒత్తిడి అంతకంతకూ పెరుగుతోంది. మూడు దశాబ్దాల క్రితం ముందస్తు ఆలోచన లేకుండా ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. జీడిమెట్ల, షాపూర్‌నగర్, బాలానగర్ ప్రాంతాల నుంచి ఫతేనగర్, బల్కంపేట మీదుగా అమీర్‌పేట, ఎర్రగడ్డ వైపు వచ్చేవారికి దగ్గరి దారి కావడంతో ఎక్కువ శాతం ఫతేనగర్ బ్రిడ్జిని ఆశ్రయిస్తుంటారు. ఈ క్రమంలో ఈ బ్రిడ్జి విస్తరణకు గత ప్రభుత్వం ప్రతిపాదించి శంకుస్థాపన కూడా చేసింది. ఈ ప్రాజెక్టు లోనూ ఇసుమంతైనా కదలిక లేదు. బ్రిడ్జి విస్తరణ జరగాలంటే ఫతేనగర్ వైపు కొన్ని ఆస్తులు స్వాధీనం చేసుకోవాల్సి ఉంటుంది. ఆ ప్రక్రియ కూడా ఇంతవరకు చేపట్టలేదు. గత ప్రభుత్వంలో శంకుస్థాపనకు నోచుకున్న ఈ బ్రిడ్జి విస్తరణ అసలు జరుగుతుందా? లేదా? అనేది వేచిచూడాలి.



ఆర్‌జీయూ పూర్తయితే సనత్‌నగర్ నుంచి బాలానగర్‌కు వెళ్లే మార్గం ఇదే..



విస్తరణకు నోచుకోని ఇరుకైన ఫతేనగర్ బ్రిడ్జి

మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం



మహిళా సంఘాల సభ్యులతో కాంగ్రెస్ సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆదం సంతోష్

సికింద్రాబాద్: మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టపీట వేస్తోందని ఆ పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదం సంతోష్ కుమార్ అన్నారు. సికింద్రాబాద్‌లో మహిళా సంఘాలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలను అందుబాటులోకి తీసుకువస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకాలను మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అర్హులైన మహిళలు లబ్ధి పొందే విధంగా చూడాలని మహిళా సంఘాలకు సూచించారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం శ్రమిస్తోందని, తమ ఉనికి చాటుకునేందుకే ఇతర పార్టీలు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ హయాంలోనే అన్ని వర్గాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు, మహిళా సంఘాలు పాల్గొన్నారు.

స్కూల్, కాలేజీ బస్సులపై స్పెషల్ డ్రైవ్



తార్నాకలో కాలేజీ బస్సు డ్రైవర్‌కు బ్రీత్‌ఎనలైజర్ టెస్టు చేస్తున్న పోలీసులు

లాలాపేట: నల్లకుంట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో తార్నాకలోని రాజ్యాభిలేఖ కార్యాలయం వద్ద స్కూల్స్, కాలేజీ బస్సులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో విద్యార్థుల భద్రత దృష్ట్యా మంగళవారం తార్నాక ప్రధాన రహదారిలో విద్యాసంస్థలకు చెందిన పలు వాహనాలు, బస్సులను తనిఖీ చేశారు. ఓ స్కూల్ బస్, ఓ కళాశాలకు చెందిన ఇద్దరు బస్సు డ్రైవర్లు మద్యం తాగినట్లు నిర్ధారించారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దేవదాస్ తెలిపారు. విద్యార్థుల సేఫ్టీపై పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు దృష్టిసారించాలన్నారు. నల్లకుంట ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సికింద్రాబాద్ గణేష్ ఆలయ పాలకమండలి సమావేశం



సమావేశంలో గణపతి ఆలయ పాలక మండలి సభ్యులు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్‌లోని గణపతి ఆలయంలో మంగళవారం పాలకమండలి సమావేశం ఈవో రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో జరిగే ఉత్సవాల నుంచి వార్షిక ఉత్సవాలతో పాటు రోజువారీ పూజలకు సంబంధించిన విషయాలను ఆయన పాలకమండలికి వివరించారు. అదేవిధంగా ఆలయ అభివృద్ధిపై కూడా చర్చించారు. అనంతరం, ఆలయానికి సంబంధించిన ఆస్తులు, భూములను పాలకమండలి సభ్యులు సందర్శించారు. సమావేశంలో పాలకమండలి చైర్మన్ ప్రభాకర్ యాదవ్, ట్రస్టీలు నరేష్, సంతోష్, అనిల్ యాదవ్, గాజుల ఆంజనేయులు, మల్లేష్, భిక్షపతి, నాగమణి, టి.నరేంద్ర, వందన, మాణిక్య ప్రభు, శ్రీరామసాయి కుమార్, ఎస్.నరేంద్ర, వేణుగోపాల్‌చారి తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో స్వర్ణం సాధించిన హన్సిక



స్వర్ణం మెడల్, సర్టిఫికేట్‌ను అందుకుంటున్న హన్సిక సిద్ధిగారి

లాలాపేట: సమర్ధనం ట్రస్ట్, కేబీఎస్‌ఏ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా దివ్యాంగుల కోసం ఈ నెల 21, 22న ఉడిపి మణిపాల్‌లో నిర్వహించిన 9వ ఐబీఎస్‌ఏ నేషనల్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్స్-2025లో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన పవర్ లిఫ్టర్ హన్సిక సిద్ధిగారి అత్యుత్తమ ప్రతిభ కనబర్చి స్వర్ణాన్ని సాధించింది. ఈ చాంపియన్‌షిప్‌లో మొత్తం 11 రాష్ట్రాల నుంచి పవర్ లిఫ్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హన్సిక మాట్లాడుతూ స్పోర్ట్స్ అథారిటీ ఎస్‌ఏటీజీఎల్ ఎల్‌బీ స్టేడియంలో శిక్షణ అందించడం తనకు ఎంతగానో సహకరించిందని, దీని వల్లే తాను స్వర్ణం సాధించినట్లు పేర్కొన్నారు. తన విజయానికి సహకరించిన డాక్టర్ రవి కుమార్, కోచ్ ప్రవీణ్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

ఉత్సాహంగా వరల్డ్ మ్యూజిక్ డే



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-45లోని భారతీయ విద్యాభవన్ ఆత్మకూరి రామారావు పబ్లిక్ స్కూల్‌లో వరల్డ్ మ్యూజిక్ డే పురస్కరించుకుని మంగళవారం విద్యార్థులు వైవిధ్యభరితమైన సంగీత కార్యక్రమాలను ప్రదర్శించారు. వ్యక్తిత్వ సమగ్ర అభివృద్ధిలో సంగీతం ప్రాముఖ్యత గురించి వివరించారు. బొమ్మ బొమ్మ తాతయ్య అనే మరాఠీ భజన ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ఆఫ్రికన్ జానపద పాటలు, పాశ్చాత్య సంగీత ప్రదర్శనలు హోరెత్తించాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీలతానాయర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతిరోజూ సంగీతాన్ని అభ్యసించాలన్నారు. సామాజిక కార్యకలాపాల్లో భాగంగా తమ విద్యార్థులు జూబ్లీహిల్స్‌లోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, అక్కడి విద్యార్థుల కోసం భక్తి గీతాలను ఆలపించారన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తా

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయం వద్ద జూలై 9 నుంచి 12వ తేదీ వరకు అమీర్‌పేటలోని మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించే తలసాని యువసేన క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్లను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోర్నమెంట్లను క్రీడాకారులు సద్వినియోగం చేసుకుని ప్రతిభ కనబర్చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, నాయకులు సంతోష్‌కుమార్, వనం శ్రీనివాస్, సచిన్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.


రవి కుటుంబానికి అండగా ఉంటాం



మాట్లాడుతున్న మల్లయ్య

లాలాపేట: విజయ డెయిరీ ఫ్యాక్టరీలో బాదాం మిల్క్ తయారీ యూనిట్‌లో స్టెరిలైజర్ బ్లాస్ట్ అయిన ఘటనలో తీవ్ర గాయాలతో దాదాపు 10 రోజుల పాటు చికిత్స పొంది ఆదివారం మృతి చెందిన విజయ డెయిరీ కాంట్రాక్టు ఎంప్లాయి టెక్నీషియన్ రవి కుటుంబాన్ని ఆదుకుంటామని విజయ డెయిరీ అధికారులు తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం లాలాపేటలోని విజయ భవన్‌లో ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో ఉద్యోగ సంఘాల నాయకులు యాదగిరి, విజయ్‌కుమార్, బాధిత కుటుంబ సభ్యులతో మెగా డెయిరీ జీఎం మల్లయ్య మాట్లాడుతూ ఈ మేరకు హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని ఆయన అన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు



సనత్‌నగర్: టమాటా 27, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 67, పచ్చకాకర 45, పందిరి బీర 35, క్యాబేజీ 21, క్యారెట్ 40, దొండ 28, గుండుబీన్స్ 95, గింజ చిక్కుడు 55, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 15, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 25, చామగడ్డ 28, మొరంగడ్డ 23, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 23, అరటికాయ 12, మునగకాయ 3-4, ముల్లంగి 5-6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

మసాజ్ సెంటర్‌లో వ్యభిచారం

అమీర్‌పేట: మసాజ్ సెంటర్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న మహిళతో పాటు ముగ్గురు యువతులను పోలీసులు పట్టుకున్న ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్‌కు చెందిన రంగా సురేఖ(45) ఎస్‌ఆర్‌నగర్‌లోని కమల నివాస్ అపార్ట్‌మెంట్‌లో విక్టోరియా బ్యూటీ సెలూన్ నడుపుతోంది. యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న సీసీఎస్ హ్యూమన్ ట్రాఫికింగ్ వింగ్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. నిర్వాహకురాలితో పాటు ముగ్గురు యువతులు, ఒక విటుడిని అదుపులోకి తీసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును ఎస్‌ఆర్‌నగర్ పోలీసులకు అప్పగించారు.


తహసీల్దార్ కార్యాలయాన్ని తరలించండి



ప్రజాభవన్‌లో వినతిపత్రం అందజేస్తున్న తల్లుల సంఘం, సీఆర్‌పీఎఫ్ ప్రతినిధులు

అడ్డగుట్ట: ప్రభుత్వ పాఠశాల భవనంలో కొనసాగుతున్న మారేడుపల్లి మండల తహసీల్దార్ కార్యాలయాన్ని మరోచోటుకు మార్చాలని తెలంగాణ తల్లుల సంఘం కో-కన్వీనర్ ఎన్.శోభ కోరారు. ఈ మేరకు మంగళవారం ప్రజా భవన్‌లో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శోభ మాట్లాడుతూ అడ్డగుట్టలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల భవనంలో కొంతకాలంగా మారేడుపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం కొనసాగుతోందన్నారు. దీని కారణంగా విద్యార్థులకు తరగతి గదులు సరిపోక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొత్త అడ్మిషన్లను కూడా తిరస్కరించాల్సి వస్తుందని చెప్పారు. దీంతో నిరుపేద పిల్లలకు నాణ్యమైన విద్య అందకపోవడం, బాల కార్మికులుగా మారడం వంటివి జరుగుతున్నాయన్నారు. అందువల్ల మండల కార్యాలయాన్ని స్కూలు భవనంలో నుంచి మరో చోటుకు తరలించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సీఆర్‌పీఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్.లక్ష్మీనారాయణ, ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ సువర్ణ ఉన్నారు.

మాదకద్రవ్య రహిత నగరంగా తీర్చిదిద్దుదాం



అవగాహన కార్యక్రమంలో వైవీఎస్ సుధీంద్ర

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-3లోని సుల్తాన్-ఉల్-ఉలూమ్ జూనియర్ కళాశాలలో మంగళవారం మాదకద్రవ్య నిరోధక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ వైవీఎస్ సుధీంద్ర హాజరై మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే హానికరమైన ప్రభావాలు, విద్యా సంస్థల్లో అలాంటి ప్రభావాలకు దూరంగా ఉండడం ఎలాగో విద్యార్థులకు అవగాహన కలిగించారు. విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడవద్దని, మాదక ద్రవ్యం దుర్వినియోగాన్ని ప్రోత్సహించే స్నేహాలను నివారించాలని డీసీపీ సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అనుపమ కోనేరు మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులు సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకోవడానికి, మాదకద్రవ్య దుర్వినియోగం పరిణామాలను అర్థం చేసుకోవడానికి, ఆరోగ్యకరమైన జీవనశైలిని నిర్మించడానికి ఎంతో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బాలస్వామి, నగర భద్రతా మండలి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

అన్ని సమస్యలను పరిష్కరిస్తాం

- బండమైసమ్మనగర్ బస్తీలో ఎమ్మెల్యే పర్యటన
- సమస్యలు ఏకరువు పెట్టిన ప్రజలు
- సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



బండమైసమ్మనగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మంగళవారం బన్సీలాల్‌పేట్ డివిజన్ బండమైసమ్మనగర్ బస్తీలో పర్యటించారు. స్థానిక కార్పొరేటర్ కె.హేమలతతో పాటు వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు స్థానిక నాయకులతో కలిసి బస్తీలో తిరిగారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలతో తాము పడుతున్న అవస్థలను స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు.

ఎంత కాలం ఈ అవస్థలు..

◆ బండమైసమ్మనగర్ బస్తీలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించి 2022లో అలాట్‌మెంట్ ఇచ్చారు. అప్పటి నుంచి లిఫ్టులు పని చేయకపోవడంతో 5, 6 అంతస్తులపైకి ఎక్కేందుకు మహిళలు, వృద్ధులు నిత్యం అవస్థలు పడుతున్నారు.

◆ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో ఖాళీగా ఉన్న ఇళ్లను అర్హులైన ఇక్కడి పేదలకు ఇవ్వాలని కోరారు. అలాట్‌మెంట్ కోసం ఎండ్ల తరబడి తాము తిరుగుతున్నామన్నారు.

◆ తాగునీటి సరఫరా సరిగా లేక పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావని వివరించారు.

◆ చెత్తాచెదారం వ్యర్థాలతో పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి.

◆ విద్యుత్తు లోఓల్టేజీ కారణంగా ఇబ్బందులు పడుతున్నాం.. అంటూ సమస్యలను మహిళలు, యువకులు, బస్తీ నాయకులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

◆ బండమైసమ్మనగర్ బస్తీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. లిఫ్టులను వెంటనే అందుబాటులోకి తెస్తామని అన్నారు. ఇక్కడి ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వివిధ శాఖల అధికారులను ఆయన ఆదేశించారు. అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతామనే భరోసా కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డాకునాయక్, జలమండలి జీఎం వినోద్, బస్తీ నాయకులు జగ్గు, సత్యనారాయణ, శ్రీహరి, బబ్లూ, బంటూ, శ్రీనివాస్, సురేష్‌తో పాటు స్థానిక నాయకులు లక్ష్మీపతి, వెంకటేషన్‌రాజు, ప్రేమ్, సాయి పాల్గొన్నారు.